క్లుప్తంగా

వార్డు సచివాలయాల తనిఖీ



వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేష్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాలను తహసీల్దార్ వెంకటేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కుల ధ్రువీకరణ పత్రాలను జాప్యం చేయకుండా పారదర్శంగా మంజూరు చేయాలని సూచించారు. సమయానికి విధులకు హాజరు కావాలని ఆదేశించారు.

ఫర్టిలైజర్ షాపులో తనిఖీలు



ఫర్టిలైజర్ షాపులో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

హిందూపురం: వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాలమేరకు పుంగనూరు ఏడీ శివ కుమార్, విజిలెన్స్‌శాఖ రంజిత్ కుమార్, ఏలూరు వ్యవసాయ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని నందిని సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. దుకాణంలో సోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో మొక్కజొన్న, వరి విత్తనాలు 125.345 క్వింటాళ్ల వీటి విలువ రూ.22.88 లక్షలు, ఎరువులకు సంబంధించి విలువ రూ.81,000 హ్యూమిక్ యాసిడ్ 250 లీటర్లు అమ్మకాలను నిలిపివేశారు. అలాగే ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, మందులకు సంబంధించి రైతులకు ప్రతి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. ఎమ్మార్పీ రేటుకే అమ్మాలని, లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్, ఏఓ సురేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

పరిగి: నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం అన్ని విధాలా పదిలంగా ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం గర్భిణులకు వైద్యపరీక్షలను నిర్వహించారు. అనునిత్యం శరీరానికి కావాల్సిన పోషకాలను ఆహారం రూపంలో తీసుకోవాలన్నారు. అలాగే దేహదారుఢ్యానికి ఆహార నియమాలను పాటించాలని సూచించారు. అనంతరం గర్భిణులకు మధ్యాహ్న భోజనాన్ని స్థానిక దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిగి వేణుగోపాలరావు సమకూర్చారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం



భోజనాలు చేస్తున్న గర్భిణులు

లేపాక్షి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు కరణం రమామణి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వెంకటచిరంజీవి, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కొల్హాపురి మహాలక్ష్మీదేవికి పూజలు



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, గాజులతో పాటు వడిబియ్యం కట్టి పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజవంశీకుడు రంగప్పరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తగ్గనున్న వేరుశనగ సాగు !

- మడకశిరలో సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లు
- ఇంత వరకూ సాగైంది 10,286 హెక్టార్లు
- వేరుశనగ సాగుకు మరో 9 రోజులే గడువు
- వర్షం రాకపోవడంతో పాటు పెట్టుబడి సాయం అందకపోవడమూ కారణమే !



మడకశిరలో ముందుస్తుగా సాగు చేసిన వేరుశనగ పంట

మండలం	సాధారణ సాగు (హెక్టార్లలో)	ప్రస్తుతం సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
మడకశిర	5,988	2,800
అమరాపురం	7,009	3,100
గుడిబండ	6,065	2,900
రొళ్ల	4,480	1,211
అగళి	2,930	275
మొత్తం	26,472	10,286

మడకశిర: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం అనుమానంగానే కనబడుతోంది. వేరుశనగ సాగుకు వర్షాలు అనుకూలించినా సాగు విస్తీర్ణం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగలేదు. రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాన్ని గత ప్రభుత్వమే సకాలంలోనే అందించింది. ఎరువులను కూడా ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచింది. అయినా సాగు విస్తీర్ణం పెరగలేదు.

గతంలో 45 వేల హెక్టార్లలో...

మడకశిర నియోజకవర్గంలో ఒకప్పుడు వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 45 వేల హెక్టార్ల వరకూ ఉండేది. ప్రస్తుత సాధారణ సాగు విస్తీర్ణం 26,472 హెక్టార్లకు పడిపోంది. రైతులకు వేరుశనగపై ఆసక్తి తగ్గిందదానికి ఇదే నిదర్శనం. వేరుశనగ సాగుకు పెట్టుబడి పెరగడం, పంటకు వివిధ తెగుళ్లు సోకి రైతులు ప్రతి ఏడాది నష్టపోతుండటం తదితర కారణాలతో సాగు విస్తీర్ణం పడిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులే చెబుతున్నారు.

10,286 హెక్టార్లలో మాత్రమే సాగు

నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో వేరుశనగ సాగు సాధారణ విస్తీర్ణం 26,472 హెక్టార్లుగా ఉంది. అయితే ఇంత వరకూ కేవలం 10,286 హెక్టార్లలో మాత్రమే పంట సాగైంది. ఇంకా 16,186 హెక్టార్లు వేరుశనగ పంట సాగుకు నోచుకోలేదు. ఇంత వరకూ అత్యధికంగా అమరాపురం మండలంలో 3100 హెక్టార్లలో పంట సాగైంది. అత్యల్పంగా అగళి మండలంలో కేవలం 275 హెక్టార్లలో మాత్రమే పంట సాగు కావడం గమనార్హం.

వర్షాల ఎఫెక్ట్

నియోజకవర్గంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం కూడా వేరుశనగ పంట సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి ఒక కారణంగా మారిందని భావిస్తున్నారు. ప్రారంభంలో వర్షాలు బాగా పడ్డాయి. దీంతో కొంత మంది రైతులు ముందుగానే వేరుశనగ పంటను సాగు చేశారు. మరి కొందరు రైతులు పంట సాగుకు సిద్ధంగా ఉన్నా 10 రోజుల నుంచి అదును వర్షాలు పడలేదు. దీంతో వేరుశనగ సాగు పంట సాగు చేయలేకపోతున్నారు. విత్తుకు సరి పడే వర్షాలు పడితే కొంత మంది రైతులు వేరుశనగ పంటను సాగు చేసే అవకాశం ఉంది.

15 వరకే సాగుకు గడువు

వేరుశనగ సాగుకు కేవలం మరో 9 రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలోగా పంట సాగు చేస్తే దిగుబడి ఆశించిన స్థాయిలో లభిస్తుంది. లేకపోతే రైతులు పెట్టుబడిని కూడా నష్టపోవాల్సి ఉంటుంది. ఈనెల 15 వరకూ వేరుశనగ విత్తనం విత్తు కోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో వేరుశనగ పంట సాగుకు ఇక కేవలం 9 రోజుల గడువు మాత్రమే ఉంది. అంతలోపు వర్షాలు పడకపోతే సిద్ధం చేసుకున్న వేరుశనగ విత్తనాలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి పరిస్థితిలో ఈఏడాది వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం అనుమానమే.

పెట్టుబడి సాయమేదీ?



వేరుశనగ సాగుపై పెట్టుబడి పెరిగింది. అయితే పంట దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండదు. ఫలితంగా పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాదు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఏర్పడుతోంది. ఇంత వరకూ ప్రభుత్వం కూడా పెట్టుబడి సాయం అందించలేదు. గత ప్రభుత్వం రైతు భరోసా కింద ఖరీఫ్‌కు పెట్టుబడి సాయం అందించేది. ఇలాంటి పరిస్థితిలో వేరుశనగ పంట సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకుంటున్నాం.

– కదురప్ప, ఫళారం, గుడిబండ మండలం

వర్షం వస్తేనే సాగు



చాలా మంది రైతులు వేరుశనగ పంట సాగు చేయాల్సి ఉంది. వర్షం వస్తే వేరుశనగ సాగు విస్తీర్ణం పెరగడానికి అవకాశం ఉంది. 15 రోజుల నుంచి వర్షం ఆగిపోయింది. ఇంకా వేరుశనగ సాగుకు 9 రోజులే గడువు ఉంది. ప్రభుత్వం కూడా ఇంత వరకూ రైతుల గురించి ఆలోచించలేదు. పంట సాగుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలి.

– చంద్రప్ప, ఫళారం, గుడిబండ మడలం

గడువు లోపే పంట వేయాలి



ఈనెలాఖరు వరకూ వేరుశనగను సాగు చేసుకోవచ్చు. ఈనెల 15 లోగా సాగు చేస్తే రైతులకు ఇంకా మంచిది. గడువు మీరిన తర్వాత పంట సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. వేరుశనగ రైతులు ఈ విషయాన్ని గుర్తించాలి. గడువు మీరిన తర్వాత రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవచ్చు. మడకశిర డివిజన్‌లో వర్షం వస్తే కొంత వరకూ సాగు విస్తీర్ణం పెరిగేందుకు అవకాశం ఉంటుంది.

– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవంతం చేయండి

మడకశిర: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 8న నియోజకవర్గ వ్యాప్తంగా వేడుకలు జరపాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అన్నదానం, రక్తదానం, మొక్కలు నాటడం తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

జగన్‌ను విమర్శించేస్థాయి నీకెక్కడిది?

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప ఆగ్రహం

మడకశిర: 'వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనవసరమైన విమర్శలు చేయడం మానుకోవాలి. ఆయన్ను విమర్శించేస్థాయి నీకు లేదు' అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్థాయి ఏమిటో తెలుసుకుని విమర్శలు చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వైఎస్ జగన్ జైలుకెళ్లి పరామర్శించడంలో తప్పేముందని ప్రశ్నించారు. జగన్, పిన్నెల్లిపై ఉన్న కేసుల గురించి మాట్లాడే ముందు ఎంఎస్ రాజు తనపై ఉన్న 54 కేసులు గురించి కూడా ఆలోచించాలన్నారు. జగన్‌పై విమర్శలు చేయడం మానుకొని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలని హితవు పలికారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కమ్యూనిటీభవనం ఆవరణలో శనివారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విస్తృతస్థాయి సమావేశానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.





సోమందేపల్లిలోని సప్తగిరి కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు , మడకశిరలో వర్షం పడుతున్న దృశ్యం

● వర్షం.. అంతటా హర్షం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. సప్తగిరి రమణ కాలనీ స్నేహలతనగర్‌లలో రోడ్లపై వర్షపు నీరు నిలచిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

మడకశిరరూరల్: మండలంలో పది రోజుల తర్వాత శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. విత్తన వేరుశన విత్తుకోవడానికి ఎంతో అనుకూలమని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అగ్రికల్చర్ కోర్సుతో ఉపాధి అవకాశాలు

మడకశిర రూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ అగ్రికల్చర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డాక్టర్ బీ సరోజినిదేవి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల, హాస్టల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ విభాగం డీన్ మణి, మడకశిర కళాశాల డీన్ డాక్టర్ బీ సరోజినీదేవి, డైరెక్టర్ కృష్ణారావు, డాక్టర్ బీఎం నాందేడే మాట్లాడుతూ వ్యవసాయ ఇంజనీర్లకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కళాశాలలో కోర్సు పూర్తి చేసుకొని భవిష్యత్తుకు పునాది వేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయపరంగా అభివృద్ధి చెందేలా విద్యార్థులు నూతన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని, విద్యార్థులు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు చెక్ పెట్టేలా పరిశోధనలు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అదేవిధంగా గేట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు అందించి అభినందించారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న వారితో డీన్‌లు

ఉపాధ్యాయవృత్తి గౌరవప్రదమైనది

పరిగి: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, సమాజ నిర్దేశకులుగా గురువుల స్థానం మొదటి వరుసలో ఉంటుందని వక్తలు తెలిపారు. మండలంలోని శాసనకోట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. భావితరాలకు మంచి పౌరులను అందించే బాధ్యత గురువులదేనన్నారు. పాఠశాలకు కృష్ణమూర్తి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మహంతి, సుల్తాన్, శంకర్, ఏపీటీఎఫ్ నాయకులు రవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

మడకశిర: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై పడిన గుంతలను వెంటనే పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేస్తూ శుక్రవారం అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రధాన రోడ్డుకు పడిన గుంత వద్ద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు, వ్యాపారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

పావగడ: తాలూకా వ్యాప్తంగా కాళ్లు, చేతులు కోల్పోయిన దివ్యాంగులకు స్థానిక నరేంద్ర ఫౌండేషన్, స్వామి వివేకానంద దివ్యాంగుల సంఘం, సమర్థనం దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లు, చేతులను శుక్రవారం పంపిణీ చేశారు. నరేంద్ర ఫౌండేషన్ డైరెక్టర్ సుధీంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల పంచాయతీలోని ఐదో సచివాలయం పరిధిలో శుక్రవారం డాక్టర్ వాసు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అతిసార, సీజినల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసు మాట్లాడుతూ అతిసార వ్యాధి ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, నిల్వ ఉంచిన , రోడ్డుపై ఉన్న ఆహార పదార్థాలను తినకూడదన్నారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అతిసార వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని తప్పనిసరిగా సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి రమణ, వైద్యాసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడబండ: వర్షాకాలం మొదలైనందున డయేరియా వ్యాధి బారినపడకుండా విద్యార్థులకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య, పీఎచ్ఎన్ సుధారాణి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డయేరియా, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సౌందర్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, శుభ్రమైన ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వినియోగించి, శరీరం మొత్తం దుస్తులు ధరించాలన్నారు. చలి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రధాన ఉపాధ్యాయుడు గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.



అతిసార వ్యాధి నివారణపై ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి సౌందర్య

దేశ సేవపై ఆసక్తి పెంచుకోండి

పరిగి: విద్యార్థి దశ నుంచే దేశ సేవపై ఆసక్తి పెంచుకోవాలని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు అన్నారు. కొడిగెనహళ్లిలోని ఆ పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 2022- 2024 సంవత్సరంలో ఎన్‌సీసీలో శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన 53 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటూ క్రీడలు, సమాజసేవ కూడా ముఖ్యమన్నారు. ఉత్తీర్ణత సాధించిన వారందరికీ 6ఏ బెటాలియన్ నుంచి వచ్చిన ఆర్మీ అధికారి విజయకుమార్ లింబు చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందించారు. ఎన్‌సీసీలో విద్యార్థులను ప్రోత్సహించి, ప్రతిభావంతులుగా తయారు చేయడంలో శిక్షణ ఇచ్చిన పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్లు కృష్ణ, అరుణ్‌కుమార్‌ను వారు ప్రశంసించారు.

కెంకెరలో పారిశుధ్యం పనులు

అమరాపురం: మండల పరిధిలోని కెంకర గ్రామంలో సర్పంచ్ తిప్పేస్వామి, కార్యదర్శి నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్యం పనులు చేపట్టారు. గ్రామంలో డయేరియా తీవ్రరూపం దాల్చడంతో మరుగు కాలువలోని చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. తాగునీటి కొళాయిలు, ట్యాంకుల చుట్టూ శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చెల్లారు.

మొక్కజొన్న సాగుపై శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు

గోరంట్ల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుపై రైతులకు పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం గోరంట్ల 4వ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్నదాతలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. పుట్టపర్తి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ జాన్సన్ , జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్‌ఖాన్ , ఏఓ మనికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు పింఛన్ ఇవ్వండి

పెనుకొండ: ప్రతి కళాకారుడికి పింఛన్ అందించాలని కళాకారులు కోగిర జయచంద్ర, హ్యాండ్స్ నారాయణ, బావిరెడ్డి, నారాయణస్వామి, రామాంజినేయులు తదితరులు రాష్ట్ర మంత్రి సవితను కోరారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంత్రి సవితను కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కళాకారుల సమస్యలు తెలియజేసి పరిష్కరించాలని కోరారు. సాహితీపరంగా ఎంతో పేరున్న పెనుకొండకు మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం ఆమెను కళాకారులు సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో మహా ప్రత్యంగిరా హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని చెరువు కట్ట వద్ద వెలసిన గంగమ్మ గుడిలో శుక్రవారం రాత్రి అమావాస్య సందర్భంగా మహా ప్రత్యంగిరా శత్రు నివారణ హోమం నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బాలికల భద్రత సామాజిక బాధ్యత

అగళి: మండల పరిధిలోని ఇరిగేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్డీటీ , మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా విద్యార్థినులకు లఘుచిత్రాల ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పించారు. మడకశిర రీజినల్ డైరెక్టర్ మల్లికార్జున, ఐసీడీఎస్ సుపర్‌వైజర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు పావగడకు తుంగభద్ర జలాలు





మేఘుల పాళ్యలో నిర్మించిన నీటి ట్యాంక్

పావగడ: ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత తుంగభద్ర జలాలు శనివారం పావగడకు చేరుకోనున్నాయి. చళ్లకెరె సరిహద్దు పావగడ తాలూకా పరిధిలోని కెంచమ్మనహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైను ద్వారా తుంగభద్ర తాగునీటిని నీటిపారుదల శాఖ అధికారులు విడుదల చేయనున్నారు. తొలుత మేఘులపాళ్యలో నిర్మించిన భారీ నీటి ట్యాంకుకు తుంగభద్ర నీటిని వదులుతారు. అనంతరం తాలూకాలో నిర్మించిన పలు ట్యాంకులకు నీరు వదిలే అవకాశముందని చెబుతున్నారు. విజయనగర జిల్లా తుంగభద్ర జలాశయం (పంపసాగర) నుంచి పావగడకు నీరు రానుంది. తాలూకాలోని 146 గ్రామాలకు చెందిన 367 జన వాస ప్రాంతాల్లో మొత్తం 46 వేల కుటుంబాలకు తాగునీరు చేరనుంది. తాలూకా వ్యాప్తంగా నీరు సరఫరా చేయడానికి 15 భారీ ట్యాంకులను నిర్మించారు. ఎత్తులో ఉన్న గ్రామాలైన సీకే పుర, రాజవంతి గ్రామ పంచాయతీలోని చిక్కనాయకన హళ్లికి విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టుకు రూ. 2,350 కోట్ల నిధులు ఖర్చు చేశారు. కూడ్లిగి, మొళకాల్మూరు, చళ్లకెరె, పావగడకు సంబంధించిన 1,116 గ్రామాలకు తాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు.